## నడికుడి.. శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైన్ పెండింగ్ భూసేకరణ వేగవంతం: కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పీఎంజీ ప్రాజెక్టు పనుల పురోగతిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేంద్ర రైల్వేశాఖ ఉన్నతాధికారులు, స్పెషల్ సీఎస్ రవాణ, ఆర్అండ్ బి, సీసీఎల్ఏ కార్యదర్శులు, ఉన్నతాధికారులతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లు, జేసీలతో, సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో గురువారం సమీక్ష నిర్వహించగా తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జేసీ శుభం బన్సల్‌లో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ వివరిస్తూ నడికుడి శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైనుకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న పట్టా, డీకేటీ భూములకు సంబంధించిన అవార్డు ప్రాసింగ్ పూర్తి చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫెరెన్స్ నందు కలెక్టరేట్ భూసేకరణ డీటీ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు




## ప్రయాగరాజ్‌లో ఇస్రో సారధుల పుణ్యస్నానాలు



శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ప్రయాగరాజ్ మహాకుంభమేళాలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తదితరులు కుంభ మేళాకు వెళ్లి పవిత్ర జలంలో స్నానం చేశారు. శాస్త్రవేత్తలుగా అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనల్లో క్షణం తీరికలేని వీరు సాంప్రదాయ బద్ధంగా మహాకుంభమేళాకు వెళ్లడం విశేషం. వీరితో పాటు ప్రస్తుతం వివిధ ఇస్రో కేంద్రాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న శాస్త్రవేత్తలు, ఇస్రో ఉన్నతస్థాయి అధికారులు కూడా మహాకుంభ మేళాకు వెళ్లి రోదశిలో విజయాల్లోనే కాదు.. భక్తిశ్రద్ధలలోను తమకు సాటి లేదని నిరూపించుకున్నారు.

# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందడుగు

### 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్




అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

చిత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోడి సంకల్పం వికసిత్ భారత్–2047, సిఎం నారా చంద్రబాబునాయుడు ధ్యేయం స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందడుగు వేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, మేయర్ అముద, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్‌లతో కలిసి కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు, పురోగతి, మౌళిక సదుపాయాల కల్పనకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న పథకాలపై లబ్దిదారులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోడి సంకల్పంతో దేశంను అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి విజన్–2047 కార్యక్రమంకు శ్రీకారం చుట్టారన్నారు. పిఎం స్వనిధి, పిఎం విశ్వకర్మ, పిఎం సూర్యఘర్ పథకాల అమలులో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించేలా అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో విజన్–2047, స్వర్ణకుప్పం–2029 కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 150 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, సిమెంటు రోడ్లు, గోకులం షెడ్లు తదితర పనులు మంజూరు చేసి 80 శాతం పనులు పూర్తి చేశామన్నారు. జిల్లాలో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి ప్రతి నియోజకవర్గానికి సంవత్సరానికి ప్రత్యేక నిధి కింద ఒక కోటి రూపాయలు మంజూరు చేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్‌కు ప్రతిపాదించారు. అలాగే హెచ్ఆర్ బ్యాంకుల మరమ్మత్తుకు నిధులు కేటాయించాలని, జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని, సెరికల్చర్ కింద సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు, చిత్తూరు, కుప్పంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, డిజిటల్ సైన్స్ సెంటర్ ఏర్పాటు, జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా దేవాలయాల అనుసంధానంలో భాగంగా అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయడం జరిగిందని, ఇందులో మొదటగా కాణిపాకం అభివృద్ధిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ రోడ్ల మరమ్మత్తు పనులు జోరుగా జరుగుతున్నాయని, మున్సిపాల్టీలకు సంబంధించి అనుసంధాన రోడ్లు లేవని, రోడ్లతో పాటు కాలువలు నిర్మించడం ద్వారా ప్రజలకు ఉపయోగపడుతాయన్నారు. సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి సాంబశివారెడ్డి, డ్వామా పిడి రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ, పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డిఎస్ఓ శంకరన్, హౌసింగ్ పిడి గోపాల్‌నాయక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు

### రూపు దిద్దుకుంటున్న కళావేదిక



సాంస్కృతిక కార్యక్రమాల వేదిక రూపకల్పన



విద్యుత్ వెలుగుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తూ పూజలందుకున్న దివ్య క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి గురువారం తెలిపారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు బడ్జెట్ రూ.7కోట్లు అయినా చేపట్టాలని సంబంధిత దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. దాంతో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి 'నభూతో' అన్నట్లు నిర్వహించనున్నట్లు గురువారం ప్రభాతవార్తకు వివరించారు. దేవాదాయశాఖ కమిషనర్ అనుమతించిన బడ్జెట్‌తోనే ఎన్నడూ నిర్వహించని రీతిలో ఉత్సవాలు నిర్వహించుటకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సాధారణంగా ఏ ఆలయంలో అయినా బ్రహ్మోత్సవాలు అంటే పది రోజుల పాటు నిర్వహించటం జరుగుతోందని అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు నిర్వహించటం సంప్రదాయమని వివరించారు. మొదటి ఉత్సవాన్ని భక్తజన వల్లభుడు భోళాశంకరుడు వాయులింగేశ్వరుడు 'భక్తకన్నప్ప' ధ్వజారోహణానికి ఇవ్వటం గమనించదగ్గ విషయం అన్నారు. ఈ ఏడాది రెండు లక్షల మంది వస్తారని అంచనా వేసి ఈ మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. శుక్రవారం సాయంత్రం భక్త కన్నప్ప ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమౌతాయన్నారు.

**కళావేదిక ప్రత్యేకాకర్షణ:**

శివుడు నాట్యప్రియుడంటారు. కాబట్టి ఆతనికి నటరాజు అనే పేరు వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో రాజగోపురం పక్కనే కన్నులు మిరుమిట్లు గోల్పునట్లు 'ధూర్జటి కళా ప్రాంగణం' ఏర్పాటు చేశామని అక్కడ 13 రోజుల పాటు రంగస్థల, సంప్రదాయ కళాకారుల ప్రదర్శనలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. 13రోజుల కార్యక్రమాలకు సుమారు 300కు పైగా రంగస్థల నాటకాలకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అయితే 150 మందికి మాత్రం అవకాశం కల్పించామన్నారు. ప్రతి రోజు సాయంత్రం పురాణ ప్రవచనాలు, ఓ ప్రముఖునితో కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# సింహ వాహనంపై సిరిసంపదల దేవుడు





చంద్రగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సింహ వాహనంపై సిరిసంపదల దేవుడు భక్తులకు దర్శనమిస్తూ ఇరుమాడవీధులలో విహరించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చారు. కళ్యాణ వెంకన్న ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరించి సింహవాహనంపై యోగ నరశింహస్వామి వారి అవతారంలో అధిష్టింపజేశారు. మూడవ రోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మృగరాజును వాహనంగా చేసుకుని తిరుమాడ వీధులలో ఊరేగారు.

**ముత్యపు పందిరిపై మూలపురుషుడు**

ముత్యపు పందిరిపై మూలపురుషుడైన శ్రీనివాసుడు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. నిర్మలమైన కాంతులకు మూలాధారం ముత్యాలు, ఆ ముత్యాల కాంతులలో దేధీప్యమానంగా వెలుగొందుతున్న సమయంలో దర్శించుకునేందుకు రాత్రి వేళ అనుకూలమైనందున మూడవరోజున రాత్రి భగవంతుడు ముత్యపు పందిరిలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ వాహన సేవలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏఈఓ ఎం.గోపినాధ్, సూపరింటెండెంట్లు వలిశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారితే ధ్యేయంగా

# వర్సిటీ అభివృద్ధి

### పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.ఉమ



తిరుపతి విద్య ఫిబ్రవరి 20 ప్రభాత వార్త బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో మహిళా సాధికారితే ధ్యేయంగా వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడపించడమే ధ్యేయంగా పనిచేస్తానని వీసీ ప్రొఫెసర్ వి.ఉమ పేర్కొన్నారు. మహిళా వర్సిటీ వీసీగా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళా వర్సిటీతో 1984 నుంచి 40 ఏళ్లపాటు సుదీర్ఘ అనుబంధం ఉందని, వర్సిటీలో ఎంతో మందినిపుణులైన, సమర్థులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. వారి సహకారంతో వర్సిటీని అంతర్జాతీయ స్థాయి తీసుకెళ్లేందుకు తనవంతు ప్రయత్నిస్తానని చెప్పారు. వర్సిటీ ఇప్పటికే దేశ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన సంస్థలతో ఎంఓయూలో కుదుర్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ప్రపంచస్థాయిలో పోటీపడే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

**నూతన పరిశోధనలు, నాణ్యమైన విద్య**

నూతన పరిశోధనల వైపు విద్యార్థినులను ప్రోత్సహించడం, ఉపాధి, ఉద్యోగాలకల్పనే లక్ష్యంగా అకడమిక్ విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందిస్తామని తెలిపారు. మహిళా సాధికారితే లక్ష్యంగా వర్సిటీ పనిచేస్తుందని, మహిళలను ఉన్నతవిద్య వైపు ప్రోత్సహించేందుకు అన్ని విభాగాలో అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ప్రాజెక్టుల సాధనలోనూ, పారిశ్రామిక రంగం వైపు మహిళలను ప్రోత్సహించడంలోనూ, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను స్వంతం చేసుకుని సమాజాభివృద్ధిలో వర్సిటీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యార్థినులకు వర్సిటీలో అధునాతన మౌళిక సదుపాయాలు, భద్రతకు ప్రాధాన్యత నిస్తామని తెలిపారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆమెను రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్చాలను అందించి అభినందనలు తెలిపారు.

## యూరియా కొరతతో దుకాణాల వద్ద క్యూ కడుతున్న రైతులు



యూరియా కోసం అరగొండలో ఎరువుల దుకాణం వద్ద క్యూ కట్టిన రైతులు

2లో

# తిరుపతి అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దాం : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త తిరుపతి నగర అభివృద్దే ధ్యేయంగా అందరూ కలసికట్టుగా పనిచేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్పొరేటర్లు, అధికారులకు పిలుపునిచ్చారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం గురువారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్ నందు మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కమిషనర్ ఎన్.మౌర్య అజెండాను ప్రవేశ పెట్టారు. కౌన్సిల్ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎం.ఎల్.సి. సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. అంతకు ముందు డిప్యూటీ మేయర్‌గా ఆర్.సి.మునికృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్పొరేటర్లు ఆయనను అభినందించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, అధికారులు హాజరైన కౌన్సిల్ సమావేశంలో ముందు సెక్రటరీ రాధిక బడ్జెట్ ను ప్రవేశపెట్టగా పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం మేయర్ శిరీషతో పాటు కొంతమంది కార్పొరేటర్లు సమావేశం నుండి బయట వెళ్ళారు. 12 గంటలకు జరగాల్సిన అజెండా అంశాల సాధారణ సమావేశంకు మేయర్, కార్పొరేటర్లు రాలేదు. తదుపరి సమావేశం నిర్వహించేందుకు తగినంత కోరం సభ్యులు ఉన్నందున, సీనియర్ సభ్యులైన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ పేరును డిప్యూటీ మేయర్ మునికృష్ణ ప్రతిపాదించగా, సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో ఆయనకు మేయర్ హోదా కల్పించడంతో కౌన్సిల్ అజెండా పై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా తిరుపతిలో పనిచేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో తీసుకున్న కొన్ని అనాలోచిత నిర్ణయాల వలన అభివృద్ధి జరగలేదని అన్నారు. ఇకనైనా అధికారులు, కార్పొరేటర్లు పార్టీలకు అతీతంగా సమన్వయంతో తిరుపతి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఇటీవల కమిషనర్ మౌర్య స్కావెంజర్స్ కాలనిలో చేసిన అభివృద్ధి పనులు అందరినీ ఆకట్టుకున్నాయని అన్నారు. నగరంలో సుందరీకరణ పనులు బాగా చేస్తున్నారని, రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా పూడ్చామని అన్నారు. సమష్టిగా, సమన్వయంతో పనులు చేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ ప్రజాభివృద్ధే ధ్యేయంగా పనులు చేస్తున్నామని అన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగేలా నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. అధికారులు చేసే అభివృద్ధి పనులకు కార్పొరేటర్లు సహకరించాలని అన్నారు. అభివృద్ధి పనులకు తాము ఎప్పుడు బాసటగా నిలుస్తామనీ, వేగంగా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

# కరువు మండలాల్లో ఉపాధి కూలీలకు ఊరట

### - అదనంగా యాభై రోజుల పనిదినాలు పెంపు ..5805మంది కూలీలకు లబ్ధి !!



కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ప్రస్తుతం ఉన్న వంద రోజుల పనిదినాలకు తోడుగా అదనంగా మరో యాభై రోజుల పనిదినాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో కరువు మండలాల్లో పనిచేస్తున్న కూలీలకు ఎంతో ఊరట లభించినట్లయింది. పడమటి మండలాలైన కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాలను ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. రాష్ట్రమంతా గతేడాది భారీ వర్షాలు కురిసినా కుప్పం నియోజకవర్గంలో మాత్రం వర్షాలు ఆశించిన మేర కురవలేదు. చెరువులు, కుంటలు, వాగులు అన్నీ నీళ్లు లేక బోసిపోతున్నాయి. చెరువుల్లో అయితే నీరు నిల్వ లేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కరువు మండలాల్లో కూలీలకు ప్రభుత్వం యాభై రోజుల పనిదినాలు పెంచడం పట్ల కూలీల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**కుప్పంలో 5805మంది కూలీలకు వెసులుబాటు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు మండలాల్లో ఉపాధి పనిదినాలు 150రోజులకు పెంచడంతో కుప్పం నియోజకవర్గంలో 5805మంది కూలీలకు వెసులుబాటు కలగనుంది. ప్రస్తుతం గుడుపల్లె మండలంలో 1470మంది కూలీలు, కుప్పంలో 1705, రామకుప్పంలో 1027, శాంతిపురంలో 1603మంది కూలీలు పనిచేస్తున్నారు. వీరికి అదనంగా మరో యాభై రోజుల పనిదినాలు కలసిరానున్నాయి.

**నీటినిల్వ పనులకు ప్రాధాన్యత :** ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటి నిల్వల పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయా మండలాల్లో ఉపాధి కూలీలు ఫారంపండ్స్, ఫిష్ పాండ్, క్యాటిల్, సప్లైఛానల్స్, ట్రెంచ్‌లు హార్టీకల్చర్ పనులతో పాటు రైతులకు చెందిన గోకులం షెడ్ల నిర్మాణాల పనులు చేపడుతున్నారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతి మండలంలోను ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిడి వెంకటరత్నం 'ప్రభాతవార్త'కు తెలిపారు.

# చంద్రప్రభ వాహనంపై వాల్మీకేశ్వరుని చిద్విలాసం





నాగలాపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల వాహన సేవలు వైభవంగా జరుగుతోంది. అందులో భాగంగా 3వ రోజు గురువారం ఉదయం 5 గంటలకు యాగశాల పూజ, 10 గంటలకు శ్రీ పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు అభిషేకం, సాయంత్రం 4 గంటలకు యాగశాల పూజ, పూర్ణాహుతి క్రతువులు ఆలయ ప్రధాన అర్చకులు కార్తీకేయ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వయంభు వెలసిన శ్రీ వాల్మీకేశ్వర స్వామికి, మరగదాంబిక అమ్మవారికి, శ్రీ దాంపత్య దక్షిణామూర్తికి, శ్రీ పల్లికొండేశ్వర స్వామివార్లకుప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై పల్లికొండేశ్వర స్వామిని, పల్లకి వాహనంలో శ్రీ మంగళాదేవిని అధిష్టించి పరిమళాలు వెదజల్లే పుష్పాలు, స్వర్ణ ఖచిత ఆభరణాలతో అందంగా అలంకరించి విశేష పూజలు చేసి వివిధ రకాల హారతులు సమర్పించారు. రాత్రి 8 గంటలకు చంద్ర ప్రభ వాహనంలో స్వామి, పల్లకిలో అమ్మవారులు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. చంద్రప్రభ సేవ ఉభయదాంలుగా సత్యవేడుకు చెందిన పల్లికొండేశ్వరాలయ మాజీ చైర్మన్ వి.ఎన్.పరమశివం, వి.ఎన్.తిరు నీలకంఠం కుటుంబ సభ్యులు వ్యవహరించారు. గ్రామోత్సవంలో కోలాట భజనలు, చిన్నారుల భరత నాట్యంప్రదర్శన భక్తులకు కనువిందు చేసింది. ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విద్యుద్దీపాలంకరణ, దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు భక్తులకు ఆకర్షణగా నిలిచింది.

# అసత్య వార్తలు ప్రచారం చేసిన నలుగురు అరెస్ట్ : కుప్పం డిఎస్పీ పార్థసారథి

- మరికొందరిపై కూడా కఠిన చర్యలు.. ప్రజలను తప్పుదారి పట్టించొద్దు !!



కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త కుప్పం పట్టణంలో ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన మరణంపై అసత్య వార్తలు ప్రచారం చేసిన నలుగురిని అరెస్ట్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకున్నట్లు కుప్పం డిఎస్పీ పార్థసారధి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అలజడి రేకెత్తించే విధంగా ప్రవర్తించినందుకు కొందరు యూట్యూబ్, సోషల్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. అసత్యవార్తలను ప్రచారించినవిషయంగా ఇంకా కొంతమంది బాధ్యులను గుర్తించి వారిపై కూడా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇకపై ఎవరైనా అసత్య వార్తలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసి ప్రజల్లో అలజడి సృష్టించే శాశ్వతమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదేని వార్తలు ప్రసారం చేయాలంటే సంబంధిత వ్యక్తులతో లేదా శాఖలతో స ంప్రదించి సరైన సమాచారం సేకరించి ప్రజలకు వాస్తవమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్

# క్రీడలతో మానసిక ఉల్లాసం



కల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందని ఎంఈఓ పోకల తాతయ్య అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ అంగన్‌వాడి కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి విద్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు వివిధ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, రిసోర్స్ పర్సన్స్ వెంకట శివ, కృష్ణవేణి, సయ్యద్ బాషా, రామనాథులు,సీఆర్పీలు వేణుగోపాల్, యూనస్ మహమ్మద్ మునీర్ అహ్మద్, మునీశ్వర, అస్లాఫ్, ఐఈ ఆర్ టి ఉపాధ్యాయులు వెంకటరమణ ..సి ఏ ఇంతియాజ్ అహ్మద్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ గోవర్ధన, సహాయకులు మునిర్కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సోమల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త మండల పరిషత్ మీటింగ్ హాల్లో గురువారం ఉదయం బీసీ కార్పొరేషన్ రుణాలకు బ్యాంకర్లతో కలిసి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 336 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపీడీవో నారాయణ, సోమల యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు కందూరు , నంజంపేట, పెద్ద ఉప్పరపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకు రుణాలకు యువకులు ఎక్కువగా ఆసక్తి చూపడం కనిపించింది.

# నిరుపేద విద్యార్థిని ఆదుకున్న వైద్యశాఖమంత్రి

- బాలికకు మెరుగైన చికిత్సకు ఆదేశాలు !!



కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ విద్యార్థిని ఆరోగ్యం పట్ల రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చొరవ చూపడంతో ఆ బాలికకు మెరుగైన వైద్యం అందించి వైద్యులు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. పలమనేరు నియోజకవర్గం మురారిపల్లికి చెందిన భవ్యశ్రీ ఓ ప్రైవేట్ కాలేజ్‌లో చదువుతోంది. వీరి కుటుంబం కూలీ పనులుచేసుకుని జీవిస్తోంది. అయితే ఈనెల 6వతేది జరిగిన రోడ్డు ప్రమాదంలో భవ్యశ్రీ కాళ్లు చేతులు విరగడంతో పాటు కాలేయం, ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. బాలికను చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నేత ఉమా మహేష్ విషమాన్ని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సహకారంతో భవ్యశ్రీకి వైద్యులు మెరుగైన వైద్యం అందించి శస్త్ర చికిత్స నిర్వహించారు. దీంతో మంత్రికి భవ్యశ్రీ తల్లిదండ్రులు, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి తులసినాథ్, జిల్లా కార్యదర్శి వెంకటాద్రిలు కృతజ్ఞతలు తెలిపారు.

# మాళిగప్ప కొటాలులో తీరిన మంచినీటి సమస్య

కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త మండలంలోని వానగుట్టపల్లి పంచాయతీ మాళిగప్ప కొటాలు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో గ్రామంలో నూతన తాగునీటి బోరు డ్రిల్ చేయించి బోరు మోటారు ఏర్పాటుచేసి ప్రజలకు గురువారం తాగునీటి సరఫరాను ప్రారంభించారు. ఈసందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంతో ఇచ్చిన ప్రతి హామీని సిఎం దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చుతామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పం అభివృద్ధికి ఎన్ని నిధులు అయినా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సిఎం ఆశయాలకు అనుగుణ ంగా తాము ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, నేతలు శివకుమార్, సంతోష్, మణి, గోవిందరాజులు, రవి, బీరప్ప పాల్గొన్నారు.

# తెదేపా నేత మృతి.. నేతల సంతాపం



కుప్పంరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త మండలంలోని మోట్లచేను పంచాయతీకి చెందిన తెదేపా సెక్షన్ ఇన్‌చార్జ్ సెల్వరాజ్ త ండ్రి తెదేపా సీనియర్ నేత ఊసప్ప మృతి చెందారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, స్థానిక నేతలు గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. ఊసప్ప మృతి పార్టీకి తీరని లోటు అనిపేర్కొంటూవారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

# తప్పుడు కేసులకు భయపడం

పాలసముద్రం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:

న్యాయం కోసం ప్రశ్నించిన తనపై తప్పుడు కేసులు పెడితే భయపడేది లేదని జాతీయ మానవ హక్కుల మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుప్రసాద్ పేర్కొన్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి గురుప్రసాద్‌పై తప్పుడు కేసు దాఖలు చేశాడు. ఈ మేరకు ఈ కేసును విచారించిన హైకోర్టు ఈ కేసును మంగళవారం కొట్టివేసింది. పాలసముద్రం మండలం నర్సిపురం పంచాయతీకి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి చట్టవిరుద్ధమైన కార్యక్రమాలను గురుప్రసాద్ ప్రశ్నించారు. ఈ ఉద్యోగి కుటుంబ సభ్యుడు ఒకరు 2022 సంవత్సరంలో గురుప్రసాద్ ఇంటికి వచ్చి అసభ్యంగా మాట్లాడి ఆపై తనను అసభ్యకరంగా దూషించి కొట్టారని రాజకీయ ఒత్తిడితో కేసు నమోదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురుప్రసాద్‌ఆధారాలతోహైకోర్టునుఆశ్రయించడంతోహైకోర్టు ఆధారాలను పరిశీలించి కేసును కొట్టివేసింది.

# గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

గుడిపాల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. గుడిపాల మండలంలో మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పలు సిమెంటు రోడ్లు, వాటర్ ప్లాంట్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గ్రామాలు, పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లోనే పల్లెలు, గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తోందన్నారు. వసంతాపురం గ్రామంలో ఎమ్మెల్యే రైతులకు గ్రాస్ కట్టర్ యంత్రాలను సబ్సిడీపై అందజేశారు. బండపల్లి గ్రామంలో దేవాలయం నిర్మించాలని మహిళలు ఎమ్మెల్యేను కోరడంతో ఎమ్మెల్యే సొంత నిధులు 50 వేలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, మేయర్ అముద, ఎంపిడిఓ శివరాజన్, తహసిల్దారు జ్యోతి, ఆర్ఐ రమాసాయి, మాజీ జడ్పీటిసీ సుమతి మురళీ, నాయకులు బాలాజీనాయుడు, తుమ్మల సాంబశివనాయుడు, అనిల్‌కుమార్, హరిప్రసాద్, గోవిందగౌడ్, రూప్‌కుమార్, అర్జున్, సోమనాధగౌడు, శంకర్ చౌదరి, సర్పంచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీలకు తెలుగుదేశం అండ



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని మండల తెలుగుదేశం మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక విలేకరులతో మైనార్టీ తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ 2019లో సిఎంగా పదవి చేపట్టిన నారా చంద్రబాబునాయుడు మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం అందించారన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ గౌరవ వేతనాన్ని పూర్తిగా నిలుపుదల చేసిందన్నారు. ప్రస్తుతం తిరిగి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి వుందన్నారు. వైకాపా ప్రభుత్వం నిలుపుదల చేసిన గౌరవ వేతనాన్ని తిరిగి సిఎం చంద్రబాబునాయుడు మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వంలో బకాయి వున్న ఆరు మాసాల ఇమాం, మౌజన్‌లో గౌరవ వేతనాన్ని ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 45 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రహ్మతుల్లా ఖాన్, నియోజకవర్గ అధ్యక్షులు జాకీర్, మండల అధ్యక్షుడు నాసిర్‌ఖాన్, కార్యదర్శి సర్వర్, స్కూల్ కమిటీ ఛైర్మన్ గౌస్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల టిడిపి ఉపాధ్యక్షులు లోకనాధనాయుడు, పట్టణ అధ్యక్షుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

# నేడు మాల వెల్ఫేర్ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ రాక

చిత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: రాష్ట్ర మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ శుక్రవారం చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒ ప్రకటనలో తెలిపారు. చిత్తూరులోని రెడ్డిగుంట వద్ద వున్న జిల్లా సమాఖ్య టిటిడిసి భవనంలో ఉదయం 10 గంటలకు రాష్ట్ర మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రానున్నారని ఈ సమావేశానికి వివిధ పథకాల లబ్దిదారులు, సంఘాల నాయకులు, ప్రజలు హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

# స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఖాళీ పోస్టులు భర్తీ

చిత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఖాళీగా వున్న ఐదు పోస్టులను మిషన్ వాత్సల్య పథకం కింద గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదంతో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ అధ్యక్షతన జిల్లా ఎంపిక కమిటీ ఎంపిక చేసింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖలో ఒక కౌన్సిలర్, ఒక అవుట్‌రీచ్ వర్కర్, మూడు మల్టీపర్పస్ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ మేరకు 19వ తేదీ కౌన్సిలర్, అవుట్‌రీచ్ వర్కర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయగా, కలెక్టరేట్‌లోని డిఆర్ఓ సమావేశహాలులో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ గురువారం మల్టీపర్పస్ హెల్పర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ ఇంటర్వ్యూ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి వెంకటేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు సిమెంటు రోడ్ల శోభ

- రూ.6.12 కోట్లతో అభివృద్ధి పనులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు



గుడిపాల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే ఒక్క గుడిపాల మండలంలోనే 6.12 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మండలంలోని బొమ్మసముద్రం గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన రెండు సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. గత 8 నెలల్లో గుడిపాల మండలంలో ఇప్పటి వరకు 29 సిమెంటు రోడ్లు, ఏడు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, రెండు ప్రహరీగోడలు నిర్మించి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు, గొల్లమడుగు, పానాటూరు, వసంతాపురం, చీలాపల్లి, పేయనపల్లి, బసవపల్లి గ్రామాల్లో సిమెంటు రోడ్లు, చీలాపల్లి, బసవపల్లిలో రైతు భరోసా కేంద్రాలు, శ్రీరంగంపల్లిలో ప్రహరీ, చీలాపల్లిలో గ్రామ సచివాలయంలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, జీజెఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులునాయుడు, మాజీ జడ్పీటిసీ సుమతి మురళీ, ఎంపిడిఓ శివరాజ్, తహసిల్దారు జయంతి, పంచాయతీరాజ్ డిఇ నవీన్, నాయకులు సాంబశివనాయుడు, బాలాజీనాయుడు, అనిల్‌కుమార్, హేమాద్రినాయుడు, శంకర్‌చౌదరి, హరిప్రసాద్‌నాయుడు, సర్పంచ్‌లు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓ జంటకు ఉచితంగా కళ్యాణం చేసిన రాజశేఖర్ దీక్షితులు



కల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త పులిచెర్ల కు చెందిన రాజశేఖర్ దీక్షితులు ప్రధాన అర్చకులు.. తన వద్దకు వచ్చిన ఒక జంటకు ఉచితంగా కల్యాణోత్సవం నిర్వహించి మనసారా ఆ జంటకు ఆశీస్సులు అందించారు. సదుం మండలం చెందిన గంగరాజు, చంద్రగిరి మండలం చెందిన లక్ష్మి శ్రావణి నిరుపేద కుటుంబానికి చెందినవారు. పెళ్లి చేసుకోవాలనుకున్న అందుకు తగ్గ స్తోమత లేకపోవడం స్వామి విషయం తెలియడంతో పులిచెర్లకు వచ్చి స్వామికి తమ పరిస్థితి తెలియజేసి వివాహం జరిపించాలని కోరారు. అందుకు స్వామి అంగీకరించి తమ ఇంటి ఆవరణంలో గంగమ్మ గుడిలో ఆ జంటకు వివాహం జరిపించారు. వివాహానికి అవసరమైన బట్టలు తాళిబొట్టు భోజనం అన్ని స్వామి సమకూర్చి కళ్యాణం జరిపించారు. ఆ జంట ఆనందముతో స్వామికి మనసారా కృతజ్ఞతలు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# యూరియా కొరతతో దుకాణాల వద్ద

తవణంపల్లె, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండలంలో యూరియా కొరత తీవ్రంగా వుండడంతో ఎరువుల దుకాణాల వద్ద రైతులు క్యూ కడుతున్నారు. గత కొద్ది రోజులుగా మండలంలో యూరియా కొరత తీవ్రంగా వుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ప్రస్తుత సీజన్‌లో నీటి ఆధార పంటగా 110 ఎకరాల్లో వరి పంట సాగవుతో ంది. ఇందుకు అవసరమైన మేర మండలానికి యూ రియా సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం సరఫరా అవుతున్న యూరియా రైతుల పంటల సాగుకు చాలకపోవడంతో దుకాణాల వద్ద క్యూ కడుతున్నారు. ప్రస్తుతం అరగొండలోని రెండు ఎరువుల దుకాణాలకు 40 టన్నుల మేర యూరియా సరఫరా అవడంతో ఉదయం నుండి రైతులు దుకాణాల వద్ద క్యూల్లో నిలబడి కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా మాత్రమే ఇస్తుండ డంతో రైతులు ఏమి చేయాలో దిక్కు తోచక అయోమయస్థితిలో ఉన్నారు. ముఖ్యంగా మండలంలోని రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో పాడి ఆవులకు కావలసిన గ్రాసం సాగుకోసం యూరియా అవసరం కావడంతో రైతులు దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నట్లు తెలు స్తోంది. దీనిపై మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌ను వివరణ కోరగా ప్రస్తుతం అరగొండలోని రెండు ఎరువు లు దుకాణాల ద్వారా 40 టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని 8 ఆర్‌బికెల ద్వారా మరో 50 టన్నుల యూరియాను సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# ఆవులపబ్బం తెచ్చిన సంక్రాంతి శోభ



పరికిదొన(చౌడేపల్లి), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త మండల కేంద్రానికి పడమరువున్న పంచాయతీ గ్రామాల్లో గురువారం జరిగిన ఆవులపబ్బం సంక్రాంతిని తలపించింది. సంక్రాంతి పండుగకు మండలంలోని 12గ్రామాల ప్రజలు దూరంగా వుంటారు. పరికిదొన, ఆమినిగుంట, గడ్డంవారిపల్లి పంచాయతీలకు చెందిన 12గ్రామాల్లో ఆవులపబ్బం పండుగ వాతావరణం తెచ్చింది. రైతులచే తయారు చేయబడ్డ చాందినీ బండ్లు చూపరులను ఆకట్టుకొన్నాయి. ఆయా గ్రామాలకు రైతులు పశువులను పరికిదొన వద్దగల కాటమరాజు ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించారు. మహిళలు రాత్రంతా పిండిదీపాలతో గ్రామదేవతలను ఆరాధించారు. పల్లెను విడచిపెట్టి బయట ప్రాంతాలకు వెళ్ళిన వారందరూ ఆవులపబ్బానికి రావడంతో ఆయా ఆగ్రామాల్లో సందడి నెలకొనింది.

# లక్ష్మయ్య వురు రోడ్డు దుస్థితిలో పట్టించుకోని అధికారులు



పూతలపట్టు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త లక్ష్మయ్య వురు రోడ్డు దుస్థితికి చేరుకుందని ప్రయాణికులు ఆరోపణలు చేస్తున్నారు. మండలంలో వావిల్ తోట నుంచి హైవే జాతీయ రహదారి మార్గం మధ్యలో లక్ష్మయ్య వురు వద్ద రోడ్డు దుస్థితిలో ఉండడంతో ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు కావడంతో ఎలా ప్రయాణం చేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ప్రమాదాలు జరగడమే కాకుండా ఆ మార్గంలో నివాసం ఉండే ఇళ్లల్లో భారీగా దుమ్ము చేరుతుంది. ఊపిరితిత్తులు సమస్యలు వస్తున్నాయని ఆ గ్రామాలు ప్రజలు ఆరోపించారు. వ్యవస్థపై పంచాయతీ తీవ్ర నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించడం వలన ప్రజలు రాకపోక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని బహిరంగంగానే ప్రజలు విమర్శిస్తున్నారు. సంవత్సరాలు తరబడిన రోడ్డు మరమ్మతులకు నోచుకోక పోవడంతో రోడ్డు దుస్థితికి చేరిందని మరమ్మతులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై సమావేశం



పూతలపట్టు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాకంగా చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కారంపై గ్రామాలలో విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో నాగరాజు ఆదేశించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ తమ గ్రామాలలో మంచి నీటి వాటర్ ట్యాంకులు డ్రైనేజీ కాలవలు పారిశుద్ధం పనులు పరిశుభ్రంగా ఉంచాలని ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాలి సూచించారు. చెయ్యని యెడల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఆర్‌డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు 550 మంది హాజరు

తవణంపల్లె, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: బీసీ కార్పొరేషన్ కార్యాచరణ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంభందించి స్వయం సహాయక రుణాల మంజూరుకు గురువారం నిర్వహించిన అబ్దిదారుల ఎంపిక ఇంటర్వ్యూలకు 550 మంది హాజరయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎన్.రెడ్డిబాబు ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాలను దత్తత తీసుకున్న 10 బ్యాంకులకు చెందిన అధికారులు సంయుక్తంగా ఇంటర్వ్యూలను నిర్వహించారు. రుణాల మంజూరు కోసం మొత్తం 580 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోగా అందులో 550 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిని బ్యాంకుల వారిగా బ్యాంకు మేనేజర్లు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వేర్వేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు.ఎంపీడీఓ రెడ్డిబాబు,బ్యాంకు మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

# గణనాధుని దర్శించుకున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి



కాణిపాకం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఆ ంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్ గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విలేకరిపై దాడిని కండిస్తూ నిరసన

పలమనేరు,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త: ఓ విలేకరిపై టిడిపి నాయకుల చేసిన దాడిని కండిస్తూ గురువారం పలమనేరు విలేకరులు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.పార్వతీపురం మన్యం జిల్లాలో విలేకరి రామారావుపై టిడిపి నాయకులు దాడి చేశారు.దీనిపై స్పందించిన పలమనేరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులు దాడిని ఖండిస్తూ స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.అనంతరం విలేకరులకు నానాటికి రక్షణ లేదని విలేకరులపై దాడి చేసిన వారిపై తగు చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని పలమనేరును ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ భవానికు వినతి పత్రం అందజేశారు.స్థానిక విలేకరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

తవణంపల్లె, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మోటారు సైకిల్‌పై వెళుతూ ప్రమాదశాత్తు డివైడర్‌ను డీకొనడంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తిరుపతి-బెంగుళూరు సిక్స్‌లేన్ రోడ్ కె.పట్నం వద్ద గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సంఘటనకు సంభందించి స్థానికుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. తిరుపతి నగరం మంగళంకు చెందిన నిరూప తన కుమారుడు కిరణ్‌కుమార్‌లు తమ సమీపం బంధువు లక్ష్మయ్య మోటారు సైకిల్‌పై తిరుపతి నుండి పెద్దపంజాణికి వెళుతుండగా కె.పట్నం గ్రామ సమీపంలో సిక్స్‌లేన్ రోడ్డులో ప్రమాదవశాత్తు డివైడర్‌ను డీకొన్నారు. ఈప్రమాదంలో మోటారు సైకిల్‌పై నడుపుతున్న లక్ష్మయ్య, వాహనంపై వున్న నిరూర, ఆమె కుమారుడు కిరణ్‌కుమార్(11)లు గాయపడ్డారు. దీనితో గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కిరణ్‌కుమార్ మృతి చెందాడు.అయితేఈసంఘటనపైతమకు ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

# తిరుపతి రైల్వే స్టేషన్లో అనేక దొంగతనాలకు పాల్పడిన నిందితుల పట్టివేత

- ఆర్‌పిఎఫ్ జిఆర్పి సంయుక్త ఆపరేషన్



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త తిరుపతి రైల్వే స్టేషన్లో ప్రయాణికుల సామాన్ల దొంగతనాలపై తరచూ ఫిర్యాదులు రావడంతో, ఆర్‌పిఎఫ్, జిఆర్పి, తిరుపతి సంయుక్త బృందం ప్రత్యేకంగా దృష్టి సారించి ఆపరేషన్ చేపట్టింది. బాధితుల నుండి సమాచారం సేకరించడం, సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించడం, అనుమానితులపై గుట్టుచప్పుడు కాకుండా నిఘా కొనసాగించడం వంటి చర్యలు చేపట్టారు. నిరంతర శ్రమతో సమన్వయంతో పని చేసిన సంయుక్త బృందం గురువారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 1,70,000 విలువ గల 85 గ్రాముల బంగారు ఆభరణాలు, 16,000 విలువచేసే రెండు మొబైల్ ఫోన్లు, 1,90,000 విలువ చేసే రెండు లాప్ టాప్‌లు మొత్తం రూ. 3,76,000 విలువ చేసే ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టు ఎదుట న్యాయ పరిశీలన కోసం హాజరుపరిచారు. ఈ ఆపరేషన్ ఆర్‌పిఎఫ్ అండ్ జిఆర్పి బృందాల అప్రమత్తత, నిబద్ధత, సమన్వయ సామర్థ్యాన్ని చాటి చెప్పారు. ప్రయాణికుల భద్రత, ఆస్తి, రక్షణ పట్ల తమ అంకితభావాన్ని మరింత బలపరిచారు.

# మహిళ హాస్టల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

-ఎస్వీయూలో విద్యార్థినుల ఆందోళన



తిరుపతి విద్య ఫిబ్రవరి 20 ప్రభాత వార్త ఎస్వీయూ మహిళా హాస్టల్లో విద్యార్థుల సమస్యలను ప రి ష్ క రి ం చా ల ని విద్యార్థినులతో కలసి విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్ధరాత్రి హాస్టల్ వెలుపలకు వచ్చి హాస్టల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా నాణ్యమైన ఆహారం అందించాలని హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మెరుపు సమ్మెకు దిగడం జరిగిందన్నారు. మహిళా హాస్టల్స్ లో మౌలిక సదుపాయాల కల్పనలో వర్సిటీ అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహాలలో శుభ్రత పాటించకపోవడంతో పాములు హల్ చల్ చేస్తున్నాయని, నాణ్యమైన ఆహారం అందించడం లేదని వాపోయారు. అనంతరం వీసీని కలసి వినతి పత్రం సమర్పించారు. వీసీ మాట్లాడుతూ శుక్రవారం నుంచి మహిళా వసతిగృహాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన ఆహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, నాల్స వ్యవస్థాపకులు సుందర్ రాజ్. ఐశ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, చిన్న జిఎన్ఎస్ వ్యవస్థాపకులు శివశంకర్ నాయక్, పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆశ, ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు శ్రీధర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినోద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర నాయక్, ఉత్తరాది విజయ్, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రయాణీకుల బ్యాగులలో నగలు దొంగిలించు దొంగ అరెస్టు

- సుమారు రూ. 12 లక్షలు విలువైన బంగారు ఆభరణములు (180 గ్రాములు) స్వాదినం



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు తిరుపతి సిసిఎస్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం రావు పర్యవేక్షణలో, తిరుపతి సిసిఎస్ డిఎస్పి శ్యామ్ సుందరం ఇన్స్పెక్టర్లు వి. చిన్న పెద్దయ్య, వి. శివ కుమార్ రెడ్డి జి. ప్రకాష్ కుమార్, ఎస్ఐ సుబాన్ నాయక్ తో సిసిఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి, పాత నేరస్తుల గురించి విచారించి, వారి యొక్క కదలికల పైన నిఘా పెట్టడం జరిగింది. గురువారం తిరుపతి హరే రామ హరే కృష్ణ రోడ్డులో నెరస్థురాలిని అరెస్ట్ చేసారు. ఉదయ్ కుమార్ భార్య సాకే స్వరూప రాణి అలియాస్ వెంకట లక్ష్మి అలియాస్ సంధ్య అలియాస్ సురభి (30) లక్ష్మిపురము సర్కిల్ నుండి ముత్యాల రెడ్డి పల్లి సర్కిల్ మధ్యలో, ఆటో నందు పిర్యాది ప్రయాణిస్తూ ఉండగా ఆమె దొంగతనం చేసింది. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుపతి సిసిఎస్ ఇన్స్పెక్టర్లు చిన్న పెద్దయ్య, శివ కుమార్ రెడ్డి, జి.ప్రకాష్ కుమార్, ఎస్.ఐ సుబాన్ నాయక్, క్రైమ్ పార్టీ సిబ్బంది హెచ్.సిలు మురళి, మునిరాజులు, బసవరాజు రమేష్, గోపికృష్ణ, రాజశేఖర్, వినాయక, పి.సిలు మోహన్, ప్రసాద్, హరిప్రసాద్, నాగరాజా శెట్టి లను జిల్లా ఎస్పీ అభినందించి వారికి నగదు రివార్డ్‌లు అందించారు.

# నేడు సాయంత్రం నుంచి వి.కోటలో ట్రాఫిక్ మళ్లింపు

వి.కోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త వి.కోట పట్టణంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి పుష్పపల్లకి సందర్భంగా శుక్రవారం సాయంత్రం నుంచి వి.కోటలో ట్రాఫిక్ మళ్లింపుకు చర్యలు చేపట్టినట్లు సిఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6గంటలనుంచి శనివారం ఉదయం 6గంటల దాకా వాహనాలను పట్ట ణంలో అనుమతించేది లేదన్నారు. కుప్పం వైపు వెళ్లేవాహనాలు బైరుపల్లి మీదుగా, పలమనేరు నుంచి వచ్చే వాహనాలు తోటకనమ క్రాస్ నుంచి మోర్నపల్లి మీదుగా వెళ్లాలని సూచించారు. పుష్పపల్లకి సందర్భంగా ఆరుమంది సిఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, 150మంది సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## మెకానిక్ భవితకు భరోసా అసోసియేషన్ లక్ష్యం

**తిరుపతి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**

మెకానిక్, వారి కుటుంబ సభ్యుల భవితకు భరోసా కల్పించడమే అసోసియేషన్ లక్ష్యమని తిరుపతి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మెకానిక్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో మృతి చెందిన గాలివీధికి చెందిన మెకానిక్ రఫి కుటుంబానికి రూ.20వేలు, మంగళంలో ఎలక్ట్రికల్ మెకానిక్‌గా పనిచేస్తూ అనారోగ్యం బారిన పడిన వేణుకు రూ. 10వేలు ఆర్థిక సాయాన్ని ఆవుల మునిరెడ్డి చేతులు మీదుగా వారి బాధితులు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న మెకానిక్, వారి కుటుంబ సభ్యులను ప్రత్యక్షంగా, పరోక్షంగా సంస్థ తరపున ఆదుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు సంక్షేమ ఫలాలు అందే విధంగా అసోసియేషన్ సైనికుల్లా పనిచేస్తోందని ఆవుల మునిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి తో పాటు నేతలు లక్ష్మణరావు, కార్యదర్శి జలంధర్, ఉపాధ్యక్షులు ప్రభువు, సహాయ కార్యదర్శి గురు ఆచారి, కోశాధికారి బాబు, ఎలక్ట్రిషియన్ ఇన్‌చార్జి విక్కీ, కేశవ్, నాగరాజు సభ్యులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలకు ప్రింటర్ బహూకరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి విద్యాప్రకాశానంద ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఓ రిటైర్డ్ ఉద్యోగి రూ.30వేల విలువ చేసే ప్రింటర్‌ను బహూకరించారు. గురువారం రిటైర్డ్ లెక్కల లెక్చరర్ వై.చెంచు కృష్ణారెడ్డి వితరణను అందించారు. ప్రింటర్‌ను ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొన్నారు.

## యువగళం హామీ ఏమైంది లోకేష్ పారూ...!

-కామన్ పీజీ సెట్ రద్దు చేసి తీరాల్సిందే -విద్యార్థి సంఘాల ఐక్య వేదిక డిమాండ్



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాత వార్త** మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కామన్ పీజీ సెట్ ను రద్దు చేసి తీరాల్సిందేనని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న కామన్ ఏపీ పీజీసెట్ ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించినట్లు తెలిపారు. జాతీయ విద్య విధానంలో భాగంగా ఏపీ పీజీ సెట్ ను నిర్వహించడం ప్రారంభించారని దీంతో వర్సిటీలలో 40శాతం మేర ప్రవేశాలు పడిపోయాయని ఆవేధన వ్యక్తం చేశారు. వెంటనే కామన్ సెట్ ను రద్దు చేసి ఆయా వర్సిటీలకు పీజీసెట్ నిర్వహణను అప్పగించాలని డిమాండ్ చేశారు. కామన్ పీజీ సెట్ను కొనసాగిస్తే వర్సిటీలు ప్రైవేటు పరం కావడం తథ్యమని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం కామన్ సెట్ను రద్దు చేయకపోతే భవిష్యత్తులో దశల వారీగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## హ్యాండ్ ఎంబ్రాయిడరీ డిజైన్‌లపై అవగాహన

**తిరుపతి విద్య ఫిబ్రవరి 20 ప్రభాత వార్త** శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాలలో హోమ్ సైన్స్ విభాగము ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయస్థాయి వర్క్ షాప్ ను ప్రారంభించారు. చేతి కుట్లు పై అవగాహన, శిక్షణను ప్రారంభించారు. గురువారం వర్క్ షాప్ ను ఎంబ్రాయిడరీ ఎంబెల్‌ష్మెంట్స్ టు స్పార్క్ యువర్ క్రియేటివిటీ అనే అంశముపై నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో వివిధ రాష్ట్రాలలో ప్రాముఖ్యత కలిగిన హ్యాండ్ ఎంబ్రాయిడరీ డిజైన్ లపై అవగాహన, శిక్షణను ఇచ్చారు. మహిళా యూనివర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ విభాగంలోని అధ్యాపకులు మిసెస్ టి దేవి, కె హబీబ్ లు రిసోర్స్ పర్సన్ గా శిక్షణను అందించారు. ఈ కార్యక్రమము ప్రారంభోత్సవంలో ప్రిన్సిపల్ డా. టి నారాయణమ్మ, వైస్ ప్రిన్సిపల్ డా.జి భద్రమణి, ఐఏసీ కన్వీనర్ డా. ఉమారాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా.ఎ విద్యుల్లత, హోమ్ సైన్స్ విభాగాధిపతి డా.వి లక్ష్మి, డా. జి శ్రీవాణి, డా.జి నాగమణి, డా.కె చెంచులక్ష్మి, డా.ఎం ఉమారాణి, డా.జి వాణి ప్రశాంతి, అధ్యాపకులు, హోం సైన్స్ విద్యార్థినిలు, డీకే డబ్ల్యూ కాలేజీ విద్యార్థినిలు పాల్గొన్నారు.



## కిరణ్ కుమార్‌కు డాక్టర్ ప్రదానం

తిరుపతి విద్య ఫిబ్రవరి 20 ప్రభాత వార్త

ఎస్వీ యూనివర్సిటీ ఆక్వా కల్చర్ విభాగ అధిపతి, బి ఓ ఎస్ చైర్పర్సన్, మహిళ హాస్టల్ వార్డెన్ ఆచార్య పి.నాగ జ్యోతి మార్గదర్శకత్వంలో బి.కిరణ్ కుమార్ కంపేరేటివ్ స్టడీస్ ఆఫ్ ది ఎఫెక్ట్ ఆఫ్ ప్రోబయాటిక్స్ ఆన్ ద గ్రోత్ అండ్ వాటర్ క్వాలిటీ మెయింటెనెన్స్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఫిషెస్ పంగాసిఎస్ హైపోథలమస్ అండ్ పియరక్టస్ బ్రోకైపోమస్ మంచినీటి చేపల పెరుగుదల, నీటి నాణ్యత నిర్వహణపై ప్రోబయోటిక్స్ ప్రభావం యొక్క తులనాత్మక అధ్యయనాలు అనే అంశంపై పరిశోధన వ్యాసాన్ని ఎస్వీయుకూ సమర్పించడం జరిగింది. ఈ పరిశోధన వ్యాసానికి డాక్టరేటు ప్రదానం చేస్తున్నట్టు వర్సిటి సిఇ ధామ్లు నాయక్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల పై దృష్టి సారించాలి.

-జర్నలిజంలో ఏఐ పాత్ర చాలా కీలకం.

-పీఐబీ ఎడిజి రాజేందర్ చౌదరి ప్రస్తావన



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాత వార్త** వేవ్స్ 2025లో భాగంగా ఆన్‌లైన్ క్రియేట్ ఛాలెంజ్‌లలో యువత భారీగా పాల్గొనాలని పత్రికా సమాచార కార్యాలయం ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అదనపు డైరెక్టర్ జనరల్, రాజేందర్ చౌదరి సూచించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్పీఎంవీవీ), తిరుపతిలో జర్నలిజం విద్యార్థులకు నిర్వహించిన మీడియా కార్యశాలను ఉద్దేశించి మాట్లాడారు ఎడిజి చౌదరి, ఆధునిక మీడియాలో ఏఐ సాధనాల వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల పాత్ర, డిజిటల్ వేదికల పెరుగుతున్న ప్రాముఖ్యత, మీడియా, వినోద రంగంలోని గొప్ప అవకాశాలపై దృష్టి సారించారు. ప్రముఖ వక్తలు, జర్నలిజం విభాగం నుండి మీడియా నిపుణులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రాంతీయ మీడియాకు అందించేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలను చేరుకునేందుకు పీఐబీ పనిచేస్తోందని, స్థానిక పరిస్థితులపై ప్రభుత్వానికి నియమిత నివేదికలను పీఐబీ అందిస్తుందని ఆయన తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ వాణి, ఎస్పీఎంవీవీ నాయశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సీతాకుమారి మాట్లాడుతూ పరిణామం చెందుతున్న డిజిటల్ పరిదృశ్యంలో మీడియా విద్య, చట్టాల పై అవగాహన, ప్రాముఖ్యతను వివరించారు, ఎస్పీఎంవీవీ జర్నలిజం విభాగం నుండి ప్రొఫెసర్ కిరణ్ ప్రసాద్, తిరుపతి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య మాట్లాడుతూ విద్యార్థులు వేగంగా మారుతున్న మీడియా వాతావరణానికి అనుగుణంగా సిద్ధంగా ఉండేలా, పాఠ్యప్రణాళికలో కొత్త సాంకేతికతలను మెరుగ్గా సమన్వయం చేసుకోవడానికి విద్యా సంస్థలు, మీడియా సంస్థల మధ్య సహకారం అవసరమని వారు మాట్లాడారు. వార్తా నివేదన, కంటెంట్ తయారీని సులభతరం చేయడానికి, ప్రజల్లో మీడియా అక్షరాస్యతను పెంపొందించడానికి ఏఐ కృత్రిమ మేధస్సు సాధనాలను ఎలా సమర్థవంతంగా ఉపయోగించవచ్చో అనే అంశంపై మీడియా సిబ్బంది జర్నలిజం విభాగం విద్యార్థులు చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు.

## నరేష్ ప్రవర్తించిన తీరు బాధాకరం

- టీటీడీ బోర్డు మెంబరు జి. భానుప్రకాష్‌రెడ్డి



**తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** టీటీడీ బోర్డు నరేష్‌కుమార్ టీటీడీ ఉద్యోగి బాలాజీ పట్ల ప్రవర్తించిన తీరు బాధాకరమని టీటీడీ బోర్డు మెంబరు జి. భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులతో భానుప్రకాష్‌రెడ్డి గురువారం భేటీ అయి మాట్లాడారు. టీటీడీ ప్రపంచంలోనే ఇది పెద్ద ధార్మిక సంస్థ అని, అంకిత భావంతో పనిచేస్తున్న టీటీడీ ఉద్యోగులు, ఉద్యోగి బాలాజీ మనస్సు నొచ్చుకొనేలా ఎవరూ వ్యవహరించడం మంచిది కాదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునారావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఉద్యోగ సంఘాలు, అనుబంధ సంఘాల నేతలకు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. బాధితుడు బాలాజీ అందుబాటులో లేనందున రెండు, మూడు రోజుల్లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సమక్షంలో బాలాజీ సమస్యను పరిష్కరిస్తామని వారికి తెలియజేశారు. ఈ సమావేశంలో టీటీడీ ఉద్యోగులు, అనుబంధ సంఘాల నేతలు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

## ఎంజిఎం ఆస్పత్రికి ఈఎస్ఐ ఆస్పత్రికి అనుమతివ్వండి

తొట్టంబేడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



పట్టణంలోని ఎంజిఎం ఆస్పత్రిలో ఈఎస్ఐ అనుమతి కోసం కార్మిక మరియు పరిశ్రమలశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను విజయవాడలో ఎంజిఎం గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ విజయవాడలో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి శివయ్య తీర్థప్రసాదాలు అందించారు. ఈసందర్భంగా గుడ్లూరు మయూర్ మంత్రితో మాట్లాడుతూ ఎంజిఎం ఆస్పత్రి చుట్టుపక్కల సుమారు 30 పరిశ్రమల వరకు ఉన్నాయని వీటిలో సుమారు 20వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వారికి శ్రీకాళహస్తిలో ఈఎస్ఐ సేవలు అవసరం అని మంత్రికి తెలిపారు. అనంతరం మంత్రి స్పందిస్తూ తప్పకుండా ఆస్పత్రి అనుమతికోసం చర్యలుతీసుకుంటామని త్వరలోనే ఎంజిఎం ఆస్పత్రిని సందర్శిస్తానని తెలిపారు.

## 18వ రోజుకు చేరిన వెటర్నరీ జూడాల సమ్మె

తిరుపతి విద్య ఫిబ్రవరి 20 ప్రభాత వార్త



ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో గౌరవవేతనం పెంచాలంటూ చేస్తున్న సమ్మె గురువారానికి 18వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా వర్సిటీ ఆవరణలో యూజీ, పీజీ పశువైద్య విద్యార్థులు పెద్ద ఎత్తున తమకు న్యాయం చేయాలని నినదిస్తూ బైటాయించారు. వారు మాట్లాడుతూ వెటర్నరీ జూడాలను చిన్న చూపు చూస్తూ పక్షపాతంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్తులో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉన్నత విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు

- మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ సుందరరామిరెడ్డి



**సత్యవేడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి కోరారు. గురువారం స్థానిక వీఎంకే కల్యాణ మండపంలో బాబు జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు కరస్పాండెంట్ పరంధాం అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంఈవోలు రవి, ఉష, మాస్టర్‌స్కూలు శ్రీనివాసులురెడ్డి తదితరులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇంజనీరింగ్, వైద్య రంగంలో విద్యార్థులు అధికంగా మొగ్గు చూపుతున్నారన్నారు. అయితే ఐఏఎస్, ఐపీఎస్ వంటి చదువుల వైపు విద్యార్థులు వెళ్ళడం లేదన్నారు. అందువల్ల ఇటువంటి చదువుల వైపు ఆసక్తి ఉన్న వారికి ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థులకు తాను ఆర్థిక సాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన దోరణిలో మార్పు రావాలన్నారు. అనంతరం క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేలాయుధం, రాబర్ట్, అధ్యాపకులు భాస్కర్, పళణి, ప్రసన్న కుమార్, ఈశ్వర్, ఆయులు, అపర్ణ, భానుప్రియ, సూర్య, దీప, ప్రియాంక, యామిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె



**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** అఖిలభారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు స్థానిక పుత్తూరు ఎల్ఐసీ కార్యాలయంలోని ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎన్.లక్ష్మణకుమార్ మాట్లాడుతూ ఎల్ఐసీలో 3,4వ తరగతి ఉద్యోగుల నియామకం వెంటనే చేపట్టాలని యూనియన్‌కు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీలోని ఉద్యోగులు ప్రతి సంవత్సరం పదవీ విరమణ చేస్తున్నా దానికి అనుగుణంగానియామకాలు చేపట్టకపోవడం శోచనీయమని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు డి.దస్తగిరి, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- మంత్రి నారా లోకేష్‌కు తరిగొండ సురేష్‌కుమార్ వినతి

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర కార్యదర్శి తరిగొండ సురేష్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తిరుపతిజిల్లా పర్యటనలో భాగంగా తిరుపతికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి ఓ వినతి పత్రాన్ని అందజేశారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, పీఆర్సీని వెంటనే విడుదలచేయాలన్నారు. సమస్యలపైమంత్రినారాలోకేష్‌సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

## పురుషులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

ఎస్వీ వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పేడు మండలానికి చెందిన 40 సంవత్సరాల వ్యక్తి మగవారికి చేసే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నో స్కాల్పెల్ వాసెక్టమీని ప్రస్తుత ఫారెన్సిక్ వైద్య నిపుణులు డాక్టర్ సేపూరి రామమోహన్ నిర్వహించారు. గతంలో వారికి 45 వేలకు పైగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసిన అనుభవం ఉంది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఆడవారికి మాత్రమే అన్న అపోహ నుంచి మగవారు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకోవచ్చుననే అవగాహన ఈ ఆపరేషన్ ద్వారా కల్పించడం జరిగింది. ఈ ఆపరేషన్ చేసుకున్న వ్యక్తి కేవలం 24 గంటలలోనే కోలుకొని తన దినచర్య కార్యక్రమాలు నిర్వర్తించుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ థియేటర్ స్టాప్ నర్స్ కొణిదల లలిత, వైద్య సిబ్బంది, సర్జన్‌కు ఆపరేషన్ సమయంలో సహాయ సహకారాలు అందించారు.

## ఎంఎల్ఏచే పరామర్శ

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం చల్లపాళెంకు చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు రమణారెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గురువారం గ్రామానికి వెళ్ళిపరామర్శించారు. శ్రీకాళహస్తి మండలంలోని చల్లపాళెం గ్రామంలో పార్టీని బలోపేతం చేయటానికి ఎంతో కృషి చేసారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబాన్ని సొదరుడు చల్లపాళెం బత్తిరెడ్డిని పరామర్శించారు. ఎంఎల్ఏతో పాటు మాజీ మార్కెటింగ్ చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, కామేష్‌యాదవ్‌లు ఉన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురం, ఎగువవీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వై.కోటేశ్వరబాబు విద్యాసామగ్రి అందించారు. 98 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించారు. గ్రామీణ విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటు అని నిరూపించాలని కోటేశ్వరబాబు ఆశీర్వదించారు.

## కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలకు నమ్మకం కల్గించాలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని గురువారం జరిగిన సమన్వయ కమిటి సమావేశంలో వక్తలు పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశాన్ని నియోజకవర్గ సమన్వయ కర్త తలపా దామోదర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా జిల్లా డిసిసి అధ్యక్షుడు బాలగురవం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పట్ల స్పందించాలని పిలుపు నిచ్చారు. మనం ప్రజలతో ఉంటే వారు మనల్ని నడుపుతుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఖలిందర్, ఉపాధ్యక్షులు శబరి, మైనారి సెల్ ప్రధాన కార్యదర్శి కరిముల్లా, భాస్కర్, రాహుల్, సురేంద్రరెడ్డి, రహంతుల్లా, బాబు, పక్రుద్దీన్, జులేషా, మహమ్మద్ ఉమర్, అల్తాప్, సలీం, సహమీర్, నవీన్‌కుమార్, నరసింహులు, గుణశేఖర్, బాబు, చందూ, అజిత్ నాగరాజు, అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయ పాఠశాలల అవసరం ఎంతో ఉంది!

తొట్టంబేడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలోని రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న జామియా దారుల్ ఉలమ్ మహమ్మదీయ అరబ్బి మదరసా 6వ వార్షికోత్సవం గురువారం వ్యవస్థాపకులు హాఫీజే ఖుర్ ఆన్ నసీం అఖ్తర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిధిగా చిత్తూరుజిల్లా జమియతుల్ ఉలమ అధ్యక్షుడు ముఫ్తీనయిం హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నేడు సంప్రదాయ పాఠశాలలను నిర్వహించటం ఎంతో క్లిష్టతరమన్నారు. వీటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు ఉండదన్నారు. అయితే నేడు మదరసాలు ముస్లిం దాతల ధాతృత్వంపై ఆధారపడి సాగుతున్నాయన్నారు. నేడు ప్రతి తల్లిదండ్రి తమ బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కోరుకుంటారు తప్ప మత పరమైన విద్యపై మక్కువ చూపటం లేదన్నారు. దీంతో సంప్రదాయాల మీద అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. ఆరు సంవత్సరాలుగా 30 మంది విద్యార్థులను ఖుర్ ఆర్ శిక్షణ ఇస్తున్నారంటే వారి కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమాల్లో అబ్దుల్ హాఫీజ్, వరదయ్యపాళెంకు చెందిన పేష్ఇమాం అల్తాప్, మక్కా మస్‌జిద్ ముతవల్లి అబీద్, హాజీ రియాజ్, ఇస్మాయిల్, ఎస్ రఫీ, ముస్తఫా, ఫరీద్, సిరాజ్‌లు పాల్గొన్నారు. ఇప్పటికి ఓ విద్యార్థి దివ్యఖుర్ ఆన్‌లోని 30 కాండాల్లో 28 పూర్తి చేసారని వచ్చే ఏడాది మరి కొందరు విద్యార్థులు హాఫీజ్‌లు అవుతారని ముగింపు సభలో నిర్వాహకులు నసీం అఖ్తర్ వివరించారు.

## క్రీడలు మానసికోల్లాసిస్తాయి..మాజీ ఎంఎల్ఏలు

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** క్రీడలు మానసికోల్లాసానిస్తాయని మాజీ ఎంఎల్ఏలు సత్రవాడ మునిరామయ్య, ఎస్‌సివి.నాయుడులు అన్నారు. గురువారం విక్రమ్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న నేషనల్ సీనియర్ సిటిజన్స్ టెన్నిస్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిధులుగా విచ్చేశారు. వీరికి విక్రమ్ స్పోర్ట్స్ అకాడమీ ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ ఘనస్వాగతం పలికారు. వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొని జాతీయ సీనియర్స్ టెన్నిస్ పోటీల్లో విశేష ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులను మాజీ ఎంఎల్ఏలు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్, స్థానిక సీనియర్ సిటిజన్స్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం : ఎమ్మెల్యే



**నారాయణవనం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** కంటి చూపుపై ప్రత్యేక దృష్టి, శ్రద్ధ చాలా అవసరమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం జాతీయ అంధత్వ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు ఎక్కువ మందికి కంటి చూపు సమస్య ఎదురవుతూ వుంటుందని గుర్తు చేశారు. దీని వల్ల పిల్లలకు బోర్డుపై అక్షరాలు కనిపించకపోవడం, తలనొప్పి వంటి సమస్యలు వస్తుంటుందన్నారు. అలాంటి వారిని ప్రాథమిక దశలో గుర్తించి వాటి పరిష్కరానికి సహకరించాలన్నారు. మండలంలోని 4 ఉన్నత పాఠశాలలో మొత్తం 138మందికి ఉచిత కంటి అద్దాలు మంజూరు కావడంతో వాటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, జిల్లా కంటివైద్యప్రోగ్రామ్‌ఆఫీసర్‌మదుబాబు, ఎంఇఒప్రభాకర్‌రాజు, ఎంపిడిఒగుణశేఖర్, డాక్టర్ దర్శిత్‌రాజ్, సర్పంచ్‌కెజిశారదమ్మగణేషన్, నాయకులు కె శివకుమార్, దొరైరాజ్, విద్యా, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

## శివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకుందాం

**నారాయణవనం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** మహా శివరాత్రి పండుగ వేడుకలను ప్రజలందరి సహకారంతో విజయవంతంగా జరుపుకుందామని తహశీల్దారు జయరాములు, కార్యనిర్వాహణాధికారి ఎం కృష్ణా నాయక్, డాక్టర్ దర్శిత్‌రాజ్, ఎఎస్ఐ జయరాంనాయక్‌లు తెలిపారు. గురువారం అరణ్యకండ్రిగ పంచాయతీ కైలాసకోన గెస్టు హౌస్‌లో సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ 26వ తేది మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్ని రకాల ఏర్పాట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసయాదవ్, పురుషోత్తం, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత నిందితుడు అరెస్టు

సత్యవేడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:

సత్యవేడు పట్టణం ఆంధ్ర సరిహద్దు మాధవపాకం మార్గం వద్ద స్థానిక పోలీసు అధికా రులు 8 కిలోల గంజా యి, మొబైల్ ఫోన్‌తో పాటు నిందితుడు బాల మురుగన్(43)ను అరెస్టు చేశారు. నింది తుడితో పాటు స్వాధీ నం చేసుకున్న గంజా యిని గురువారం సబ్ ఇన్‌స్పెక్టర్ కార్యాల యం వద్ద మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భం గా ఎస్ఐ రామస్వామి మాట్లాడుతూ మాధర పాకం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేప ట్టమన్నారు. ఎర్రటి బ్యాగును చేతిలో పెట్టు కుని అక్కడ ఓ వ్యక్తి తిరుగుతుండగా అను మానంతో దగ్గరకు పిలిపించుకుని తనికీ చేయగా దీంతో ఎర్రటి బ్యాగ్‌లోని గంజాయి బయట పడిందన్నారు. ఈ నేపథ్యంలో నింది తుడుని అదుపు లోకి తీసుకుని విచారణ చేశా మన్నారు. వైజాగ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి సత్య వేడు మీదుగా చెన్నైకి వెళుతున్నట్లు విచా రణలో తేలిందన్నారు. పైగా నిందితుడు బాల మురుగన్ పాండిచ్చేరికి చెందిన వాసిగా గుర్తిం చామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.80 వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాం డ్ విధించినట్లు ఈ సందర్భంగా ఎస్ఐ రామస్వామి పేర్కొన్నా రు. కాగా నిందితుడు బాలమురుగన్‌పై వైజాగ్ పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసులు నమో దైందన్నారు.

## భక్తులకు నిస్వార్థంగా సేవలందించండి

తొట్టంబేడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

మహాశివరాత్రికి వచ్చే భక్తులకు నిర్వార్థంగా సేవలందించాలని డిఎస్పీ నరసింహ మూర్తి అన్నారు. రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ నిస్వార్థంగా సేవలందించాలని కోరారు. గురువారం స్థానిక సరస్వతీ బాయి పురపాలక ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జరుగుతున్న గైడ్ కెప్టెన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ల వినియోగం వల్ల జరిగే అనర్థాల గురంచి ఆయన అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లీడర్లు శిక్షకులు శంకుతలమ్మ, ధనలక్ష్మి, కార్యాలయ కమిషనర్ టి.రమేష్‌బాబు, రాష్ట్ర సహాయ కార్య నిర్వహణ కమిషనర్ ఎన్.కోటేశ్వరరావు, జిల్లా క్వారర్ మాస్టర్ మునిరత్నం, యువత కమిటీ చైర్మన్ అజారుద్దీన్, డిఓసి సతీసావిత్రి, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank | రేణిగుంట రోడ్డు శాఖ, తిరుపతి ఫోన్: 99517 18729, 96769 36872

### బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 27.02.2025 వ తేది లోపు బకాయిలు, ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:28.02.2025 ఉ.10.00గం||లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు** బ్యాంకు వారికి అధికారం కలదు.

| వ. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం రూ. |
|---|---|---|---|---|
| 1 | 180040759376 | షేక్ నదియా భర్త షేక్ హాస్సేన్ షరీఫ్, ఇ.నెం.19-3-2హెచ్18ఇ201, సుమంత్ హోమ్స్, శ్రీపురం జంక్షన్, కెరాలచెరువు, తిరుపతి- 517501 | 36.600 | 1,31,822.00 |

తిరుపతి, తేది: 20.02.2025 సం|| బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

కెనరా బ్యాంక్ Canara Bank Together we can

తిరుపతి ప్రధాన శాఖ-2, ఎస్.డి.లేఔట్, తిరుపతి, సెల్: 9440059576

### స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002లోని రూల్3 తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించు కుంటూ **కెనరా బ్యాంకు వారి** యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు నోటీసులో తెలిపిన మొత్తం **రూ.13,31,058.36 పై (పదమూడు లక్షల ముప్పై ఒక్క వేల యాభై ఎనిమిది రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులను** సదరు నోటీసు అందుకున్న తేది నుంచి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసినదిగా రుణగ్రహీత **శ్రీ సి.మునీంద్ర తండ్రి లేట్ గోవిందయ్య, గ్యారంటారు: శ్రీ రాంబాబు కాలగుంట తండ్రి వీరబ్రహ్మయ్య** గారిని కోరుతూ **30.07.2024** వ తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని నిబంధన 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని **19.02.2025 వ తేదీన** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, హామీదారులకు, సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెక్షన్ 13 సబ్‌సెక్షన్(8) క్రింద సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం ఇవ్వడమైనదని రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఏ వ్యవహారం జరుపరాదని, ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో ఏదేని వ్యవహారాలు జరుపదలిస్తే **కెనరా బ్యాంకు వారికి రూ.13,31,058.36 పై (పదమూడు లక్షల ముప్పై ఒక్క వేల యాభై ఎనిమిది రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలైనవి చెల్లించుటకు లోబడి ఆ విధంగా చేయవచ్చును.

### స్థిరాస్తి వివరణ

చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి, రేణిగుంట సబ్ జిల్లా, రేణిగుంట మండలం, నెం.20 తూకివాకం గ్రామలెక్కదాఖలా తూకివాకం గ్రామ పంచాయతీ 12వ వార్డు, తూకివాకం రూరల్ రెసిడెన్షియల్ ఏరియా సర్వేనెం.33/2, 34/1, ఎ.2.21లో వేసిన ప్లాట్లలో ఒక ప్లాటుకు కొలతలు: తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు: 54అ. లేదా 16.470మీ. దక్షిణం వైపు: 53అ. లేదా 16.165మీ., ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు 75 అ. లేదా 22.875మీ. పడమర వైపు: 75అ. లేదా 22.875మీ. వెరశి మొత్తం 4012.5 చ.అ. లేదా 445.83 చ.గ. హద్దులు: తూర్పు: సి.దేవకి స్థలం, పడమర: సరోజమ్మ స్థలం, ఉత్తరం: 33అ. వెడల్పు గల రోడ్డు, దక్షిణం: సి.దేవకి స్థలం.

స్థలం : తిరుపతి తేది: 19.02.2025 సం|| అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank Together we can | సత్యవేడు శాఖ, గాంధీరోడ్డు, సత్యవేడు, సెల్:83338 39217

### రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు తేది: 31.01.2025

**రుణగ్రహీత:శ్రీ కె.భాస్కర్,** తండ్రి కె.జయరాజ్, 1-33ఎ, బిఎస్ఎన్ఎల్ టవర్ వీధి, కన్నవరం, సత్యవేడు, ఆంధ్రప్రదేశ్- 517588

**హామీదారు: శ్రీమతి సన్ని మైదిలి,** భర్త సన్ని సుబ్రమణ్యం, డి.నెం.1-7, జడేరి కండ్రిగ, కన్నవరం, సత్యవేడు - 517588

అయ్యా/ అమ్మా !

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు మా **కెనరాబ్యాంక్, సత్యవేడు శాఖ,** నుండి మీరు **శ్రీ కె.భాస్కర్ తండ్రి కె.జయరాజ్ గారు** కాలానుగుణంగా పొందిన లోన్/ రుణ సౌకర్యాల వివరములు

| రుణ స్వభావం | రుణం మొత్తం & ఖాతా నెంబరు | తేది: 31.01.2025 నాటికి బకాయిమొత్తం | వడ్డీ రేటు |
|---|---|---|---|
| హౌసింగ్ లోన్ | రూ.19,00,000/- 31899740000314 | రూ.8,89,802.72 | 10.90% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసు షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో విఫలమైనందున బ్యాంకు సదరు ఋణాన్ని తేది: 29.01.2025 నిరర్థక ఆస్తిగా (ఎన్‌పిఏగా) వర్గీకరించినది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.8,89,802.72 (ఎనిమిది లక్షల ఎనభై తొమ్మిది వేల ఎనిమిది వందల రెండు రూపాయల డెబ్బై రెండు పైసలు మాత్రమే)**లను + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసును జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏదేని హక్కులను మేము వినియోగించుకుంటాము. అంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించదకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు / లేదా అమలులో వున్న చట్టం క్రింద లభించే ఏదేని ఇతర హక్కులకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించు కోగలరని సూచించడమైనది. మా శాఖ రికార్డులలో అందుబాటులో వున్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగినది.

**షెడ్యూలు: తనఖాలో వున్న ఆస్తి యొక్క వివరములు దిగువ తెలుపబడమైనది.**

చిత్తూరు జిల్లా, శ్రీ తిరుపతి బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, సత్యవేడు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, సత్యవేడు మండలం, కన్నవరం గ్రామలెక్కదాఖలా, కన్నవరం గ్రామ పంచాయతీ, కన్నవరం గ్రామ నత్తం సర్వేనెం. 243/3 లో ఎ.13.67 సెంట్లు హద్దులు: తూర్పు: శెరవేటి గోవిందయ్య ఇల్లు, పడమర: వీధి, ఉత్తరం: ఏలుమలై ఇల్లు, దక్షిణంం ఏలుమలై ఇల్లు మరియు విక్రయదారు భూమి, కొలతలు: తూర్పు నుండి పడమర: 107 1/2అ. లేదా 32.78మీ. ఉత్తరం నుండి దక్షిణం: 66 1/2 అ. లేదా 20.28 మీ. అనగా 7148.75చ.అ. లేదా 794.30చ.గ. **టైటిల్ హోల్డర్ పేరు: శ్రీ కె.భాస్కర్**

స్థలం : సత్యవేడు సం|| అధీకృత అధికారి,
తేది: : 31.01.2025 కెనరా బ్యాంక్

## ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి



చిల్లకూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలోని రెట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.వెంకటేష్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో మెడల్ సాధించిన సందర్భంగా రాజనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో గురువారం ట్రస్ట్ సభ్యులు రాజేంద్రారెడ్డి చేతులమీదుగా విద్యార్థికి 10,116 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పీడీ మస్తాన్ బీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారించండి



వాకాడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : మండలంలోని రానున్న వేసవికాలంలో నీటి ఎద్దడిని నివారించాలని మండల సర్వసభ్య సమావేశంలో కొడవలూరు దామోదర్‌రెడ్డి అధికారులను కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వేద శాఖలో ఆగి ఉన్న పనులను వెంటనే జరిగా చూడాలని ఆయన అధికారులను కోరారు. ముఖ్యంగా మండలంలోని అన్ని పంచాయతీలలో పాటు తీర ప్రాంత గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను కోరారు. పలువురు సర్పంచులు విజయభాస్కర్ రెడ్డి, సిద్దారెడ్డి మధుసూదన్ రెడ్డి అగ్రికల్చర్, ఆర్డబ్ల్యూఎస్, ఎన్ ఆర్ జి ఎస్ పనులపై సంబంధించిన అధికారులను ప్రశ్నించారు. ఎంపీడీవో అన్నపూర్ణ రావు స్పందించి కరివేసిన పనులన్నీ జరిగాలా చూస్తానని, వెంటనే అధికారులతో మాట్లాడతానని సర్పంచులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాటంగారి వెంకట రమణయ్య, నిర్మల సర్పంచులు సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, బండి వెంకట రత్నమ్మ, అనిల్ కుమార్ రెడ్డి, కిషోర్ కుమార్, సర్పంచులు ఎంపీటీసీలు, డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, మండల పరిషత్ ఏఓ శ్రీనివాసరావు, సిడిపిఓ ముని కుమారి, వ్యవసాయ శాఖ అధికారి దీప, వెటర్నరీ డాక్టర్ కృష్ణారావు, పిఆర్ఏఈ కిరణ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఏపీఓ విజయ, ఇన్చార్జి ఏపిఎం మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎదురెదురుగా బైక్‌లు ఢీ : ఒకరు మృతి

వడమాపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : కదిరిమంగళం క్రాస్ వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఎస్విపురం గ్రామానికి చెందిన సుధాకర్ (52) అక్కడికే మృతి చెందగా, తమిళనాడుకు చెందిన హర్ష (25) తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. సుధాకర్ తిరుపతిలో మేస్త్రీ పని ముగించుకొని ఇంటికి వస్తుండగా, హర్ష చెన్నై నుండి ద్విచక్రవాహనంలో తిరుపతి వస్తూ కదిరిమంగళ క్రాస్ వద్ద ఢీ కొనడం జరిగిందని ఎస్ఐ వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ధర్మారెడ్డి తెలిపారు.

## ఆర్టీసీ కార్గో ఏజన్సీపై ఫిర్యాదు

కోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : కోట ఆర్టీసీ బస్టాండులో కార్గో ఏజన్సీ పై ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు చెప్పారు. గురువారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ కార్గో ఏజన్సీ నిర్వాహకులు పార్శిళ్లపై అదనంగా సొమ్ము వసూలు చేస్తూ సంస్థకు చెడ్డపేరు తీసుకొస్తున్నారని ఆరోపించారు. కార్గో ఏజన్సీ వద్దకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారని చెప్పారు. కార్గో ఏజన్సీ పై ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజల హృదయాల్లో జనార్ధన్‌రెడ్డి

కోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెందోడు సర్పంచ్ దేవారెడ్డిమాధవి, వైసీపీ నాయకులు దేవారెడ్డి నాగూర్‌రెడ్డి అన్నారు. గురువారం జనార్ధన్‌రెడ్డి 90వ జయంతిని పురస్కరించుకొని విద్యానగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో ఎంతోమందికి ఓనమాలు నేర్పించి తీర్చిదిద్ది రాజకీయ భిక్ష పెట్టిన ఏకైక నాయకుడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 24 నుంచి ఇంటర్వ్యూలు

కోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : కోట మండల పరిషత్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపిడిఓ వేణు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే లబ్ధిదారులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని కోరారు.

## శ్రీనాగేశ్వర దేవస్థానానికి నూతన ఉత్సవ కమిటీ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానానికి తాత్కాలికంగా నూతన ఉత్సవ కమిటీని గురువారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రకటించారు. ఆమె మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించేందుకు తాత్కాలికంగా ఉత్సవ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీలో ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి ప్రధాన సభ్యునిగా ఉంటారని, ఆయనతో పాటు నలజాం రాము, మాముడూరు శాంతి, నర్రెడ్డి సాయికిరణ్, పట్టుపల్లి రాజశేఖర్, చెన్నం శ్రీనివాసులు, బిజెపి కన్వీనర్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, వి.శ్రీనివాసులు నాయుడు, పి.మాధవ నాయుడు, కాళంగి ప్రభాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేగేటు పరిసరాల ఆధునికీకరణ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డులోని రైల్వేగేటు వద్ద ఉన్న పరిసరాలను ఆధునికీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని సదరన్ రైల్వే ఎడిఆర్ఎం ఎకె సింగ్ వెల్లడించారు. గురువారం రైల్వేస్టేషన్, ఇతర రైల్వేకి సంబంధించిన కార్యాలయాల్లో వార్షిక తనిఖీలలో భాగంగా ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేగేటు వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నా మన్నారు. ఇందులో భాగంగా గేటు వద్ద లౌడ్ స్పీకర్‌తో సౌండ్ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాత రైల్వే క్యాబిన్ వద్ద గార్డెన్ ఏర్పాటు చేసి ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదరన్ రైల్వేకు చెందిన వివిధ శాఖల అధికారులు తెలిపారు.

## మొబైల్ షాపులపై ఐటి దాడులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలోని మొబైల్ షాపులపై ఆదాయపు పన్నుశాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఐటి అధికారుల ప్రత్యేక బృందాలు పట్టణంలో మొబైల్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందడంతో మొబైల్ షాపుల వారు ఒక్కసారిగా అప్రమత్తమై షాపులను మూసివేశారు. దీంతో ఆదాయపు పన్నుశాఖ అధికారులు దాడులు చేసే వీలులేక తిరిగి వెళ్లిపోయారు.

## వరసిద్దుని సేవలో 20 సూత్రాల కమిటీ ఛైర్మన్



కాణిపాకం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ శ్రీలంక దినకర్ గురువారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఆలయ చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరాలయ శివరాత్రికి రండి -నారాలోకేష్‌కు ఆహ్వానం



శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో వెలసిన చారిత్రక ప్రసిద్ధి చెందిన గుడిమల్లం లో వెలసిన పరశురామేశ్వరాలయంలో ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ చైర్మెన్ బత్తల గిరి నాయుడు యువ నాయకుడు విద్యాశాఖా మంత్రి నారాలోకేష్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. ప్రపంచ ప్రసిద్ధిం చెందిన పరశురామేశ్వరాలయంలో వెలసిన లింగం ఇతర ఆలయాలలో లింగాల కన్నా భిన్నంగా ఉంటుందని వివరించారు. ఇటీవల కాలంలో ఆలయానికి వచ్చే భక్తులు సంఖ్య పెరిగిందన్నారు. ఇటీవల హుండీల ఆదాయం పెరిగిందన్నారు. ఒక సారి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని గిరిబాబు నాయుడు ఆహ్వానించారు.

# గూడూరు డివిజన్

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య!

తడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :తడ రైల్వే స్టేషన్ సమీపంలో అనపగుంట గ్రామం వద్ద గురువారం ఉదయం 20-30 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు సూళ్లూరుపేట జిఆర్పీఓపి ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. చెన్నై నుండి సత్రాగాచ్చి వెళ్ళు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కిందపడి మృతి చెందినట్లు వివరించారు. సదరు వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు, ఎరుపురంగు టీ షర్టు మరియు సిమెంట్ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృత దేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ఆచూకీ తెలిసినవారు 7036043535, +91 7013413616 ఫోన్లు నెంబర్లకు తెలుపగలరన్నారు.

## జనార్ధన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

**- నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



కోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని ఆయన తనయుడు, నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మన్, ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల అధినేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జనార్ధన్‌రెడ్డి 90వ జయంతిని పురస్కరించుకొని గురువారం కోట మండలం విద్యానగంలోని నేదురుమల్లి సుబ్బరామరెడ్డి కళాభవన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి జనార్ధన్‌రెడ్డి ఆశయాలను కొనసాగించడంలో భాగంగా ఆయన జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా రక్తదాన శిబిరంతో పాటు ప్రజా ప్రయోజన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఎన్‌బికెఆర్ విశ్వవిద్యాలయంగా మారబోతుందని చెప్పారు. అంతరించిపోతున్న కళా రంగాన్ని బతికించేందుకు మార్చి నెలలో మ్యూజికల్ ఫెస్టివల్ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కళారంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం చేసిన నేదురుమల్లి అభిమానులకు, స్నేహితులకు, యువతకు, ఉద్యోగులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు, డిఎస్ఆర్ గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బంది దాతల నుంచి 830 యూనిట్లు రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి మేరిగ మురళీధర్, యల్లసిరి గోపాల్‌రెడ్డి, కొడవలూరు భక్తవత్సలరెడ్డి, ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత జనార్ధన్‌రెడ్డిదే



వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి నియోజకవర్గంను ఎంతగానో అభివృద్ధి చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ శతురాశి బాలయ్య తెలిపారు. మాజీ సీఎం జనార్ధన్ రెడ్డి 90వ జయంతి సందర్భంగా వెంకటగిరిలోని ఆయన విగ్రహానికి వైసీపీ నాయకులు, నేదురుమల్లి అభిమానులు పూలమాలేసి నివాళులర్పించారు. జనార్ధన్‌రెడ్డి తనయుడు రాంకుమార్‌రెడ్డిని గెలిపించుకుంటే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వైసిపి జిల్లా మాజీ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ మాట్లాడుతూ అన్ని చట్టసభల్లో జనార్ధన్ రెడ్డి ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు దశరథరామిరెడ్డి, నాగయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు పులి ప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు శంకరయ్య, శివ, వహీదా, ఎంఎ నారాయణ, నాయకులు మలిరెడ్డి, సతీష్, చిన్న, మురళి కృష్ణ, వెంకటేశ్వర్లు, బండి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు రుణాల కోసం ఇంటర్వ్యూలు

వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న బీసీ లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో కేవీ కోటేశ్వరరావు తెలిపారు. 21వ తేదీ ఉదయం లబ్ధిదారులు ఎంపీడీవో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

## మున్సిపల్ డిఇ శ్రీధర్ గుండెపోటుతో మృతి



వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని మల్లమ్మగుడివీధిలో ఆయన ఒక గది తీసుకొని ఒంటరిగా ఉంటున్నారు. డిఇ గురువారం కార్యాలయానికి రాకపోవడంతో సిబ్బంది ఆయనకు పలుమార్లు ఫోన్ చేయడంతో లిఫ్ట్ చేయకపోవడం వల్ల రూము వద్దకు వచ్చి చూడగా ఆయన కింద పడి ఉండడానికి గమనించారు. ఆయన మృతికి కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిబ్బంది సంతాపం తెలిపారు.

## లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలన

గూడూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బీసీ, ఈబీసీ ఈడబ్ల్యుసి కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు అప్లై చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం బ్యాంకు అధికారులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 33లోన్లుఇచ్చారని, ఎవరు దళారుల మాటలు విని మోసపోవద్దని సూచించారు.

## ఎస్ఎస్ కెనాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలి



వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : ఎస్ఎస్ కెనాలకు పూర్తి నిధులు పూర్తిగా కేటాయించి ప్రజానీకాన్ని ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ కు ఫారెస్ట్ క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ 10 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నప్పటికీ ఆ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడం దారుణమని తెలిపారు. ఈనెల 24న జరిగే శాసనసభ సమావేశాలలో ఈ ప్రాంత ఎమ్మెల్యేలైన కురుగొండ్ల రామకృష్ణ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఈ విషయంపై ప్రశ్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ నాయకులు గోవిందస్వామి, వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి పల్లెపాటి బాలకృష్ణయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి శివకుమార్ ,యువజన సంఘం నాయకులు జై కృష్ణ, సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడి సిబ్బందికి ఆటల పోటీలు

వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : అంగన్వాడి సిబ్బందికి మహిళా దినోత్సవం సందర్భంగా ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజే స్తామని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. మండల స్థాయిలో విజయం సాధిం చిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తామని తెలిపారు. మార్చి నెల ఎనిమిదో తేదీ మహిళా దినోత్సవ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాబయ్యలు పాల్గొన్నారు.

## ఏపీ ప్రభుత్వం పరిశ్రమలకు పెద్ద పీట : కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్ద పీట వేస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పీఎం,ఈజీపీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను లబ్దిదారుల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలిస్తే 1278 దరఖాస్తులకుగాను 541యూనిట్లు మంజూరు చేయగా 516 గ్రౌండింగ్ అయ్యాయని అధికారులు తెలుపగా మిగిలిన వాటి మంజూరు కోసం త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఏపీఐఐసీ ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమ లు వివిధ దశలలో ఉన్నవి, ఇంకా ప్రారంభించని వాటిని త్వరిత గతిన ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పరిశ్రమల శాఖ అధికారి మారుతి ప్రసాద్, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి విజయ భరత్‌రెడ్డి, జోనల్ మేనేజర్ తిరుపతి స్పెషల్ ప్రాజెక్టు జోన్ ఎల్ శివకుమార్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి, జిల్లా అగ్ని మాపక అధికారి రమణయ్య, అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 23న ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్

**- పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : ఈనెల 23న జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత ముఖ్య పర్యవేక్షణ అధికారులను, ఇన్విజిలేటర్లను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రూప్-2 మెయిన్స్‌కు సంబంధించి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షల మొత్తానికి జేసీ ఓవరాల్ ఇన్‌చార్జిగా ఉంటారన్నారు. గ్రూప్-2 పరీక్షలు పేపర్ 1 ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్ 2మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటలకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పేపర్ 1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల లోపు చేరుకోవాల్సి ఉంటుందని, పేపర్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉంటుందని అదనంగా గ్రేస్ పీరియడ్ ఉదయం, మధ్యాహ్నం 15 నిమిషాలు వరకు మాత్రమే అనుమతి ఉంటుందని, అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు.

## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గురువారం నాయుడుపేట పట్టణంలోని విన్నమాల కాలువపై డ్రోన్ సహాయంతో దోమల నివారణకు దోమల మందును స్ప్రే చేయించడం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లడుతూ నాయుడుపేట మున్సిపాల్టి పరిధిలో దోమలను నివారించడం వల్లన ప్రజలను రోగాల భారిన పడకుండా కాపాడవచ్చునన్నారు. ఆమె వెంట మున్సిపాల్టి చేర్మేన్ కటకం దీపిక, కమిషనర్ పజులుల్లా, వైస్‌చేర్మేన్ 786రఫి,కౌన్సిలర్లు,తెదేపా నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## నేదురుమల్లి కుటుంబం అధికారుల పక్షపాతి

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



వాకాడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి నుండి తనవరకు అధికారుల పక్షపాతినని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఆఫ్ మాజీ చైర్మన్, వైకాపా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం వాకాడు అశోకపిల్లర్ సెంటర్ సమీపంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 90వ జయంతి కార్యక్రమంలో భాగంగా విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. బాలకృష్ణరెడ్డి సేవా క్షేత్రంలో నేదురుమల్లి జయంతి సందర్భంగా కేక్‌ని కట్ చేసి అందరికి పంచిపెట్టారు. 2027 సంవత్సరంలోనే ఎన్నికలు వస్తున్నాయని, రానున్నది వైఎస్ఆర్‌సిపి పార్టీ ప్రభుత్వమేనని వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే అధికారులను గుర్తించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా అధికార ప్రతినిధి దామోదర్ రెడ్డి, సర్పంచులు దువ్వూరు విజయ భాస్కర్‌రెడ్డి, సిద్ధారెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బండి వెంకట రత్నమ్మ, నాయకులు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, వాకాటి జనార్ధన్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

బాలాయపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న బీసీ లబ్ధిదారులు ఈనెల 21వ తేదీ స్త్రీశక్తి భవనంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. 21వ తేదీ ఉదయం బీసీ లబ్ధిదారులు స్త్రీశక్తి భవనంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

## కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ వామపక్షాలు నిరసన



గూడూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా వామపక్షాలు నిరసనలు నిర్వహించారు. గూడూరులోని అంబేద్కర్ గ్రహం వద్ద సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సిపిఎం నగర కార్యదర్శి జోగి శివయ్య మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోంది. దేశంలో రైతులకు కనీసం మద్దతు ధర దక్కడం లేదు మోడీ 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేసి దేశాన్ని దివాలా చేసేపనిలో మోడీ ప్రభుత్వం ఉంది కార్పొరేట్ కంపెనీలకు సానుకూలంగా ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెంట్ దేశ ప్రజలు వామపక్షాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్, నగర్ కార్యదర్శి ఎస్కె కాలేశ చిలుకూరు మండల కార్యదర్శి జి రమేష్, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు సునీల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎంపీ ఎంబేటి చంద్రయ్య, నాయకులు వెంకటయ్య, సిపిఎం నాయకులు చంగయ్య, మణి, సురేష్, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భక్త కన్నప్ప ధ్వజారోహణం.

## పూజల్లో భక్తకన్నప్పకు అగ్రతాంబూలం

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

భక్తకప్పప్ప కొండ పురాతన కాలం నాటి చిన్నపాటి ఆలయంతో సతమతమయ్యేవారు. ప్రస్తుతం భక్తకన్నప్ప కొండపై కొత్తగా ఆలయం నిర్మించిన ఆలయంలో ఉత్సవాల్ని నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తి అంటే ఏ భక్తునికి అయినా మూడు మూగజీవాలతో పాటు మొదట గుర్తొచ్చేది భక్తకన్నప్ప, తన కన్నులను ముక్కంటీశునికి ఇచ్చి మోక్ష ం పొందిన ఓ వేటగాని వృతాంతం ఎవరికైనా గుర్తుకొస్తుంది. ఇక్కడి ఆలయంలో నిర్వహించే పూజల్లో అగ్రతాంబూలం కైలాసనాధుడు తన భక్తుడైనా తిన్నడికి ఇచ్చాడు. తాను కొండ కింద వెలసి తన భక్తుడు భక్తన్నప్పకు కైలాసగిరి పర్వతపంక్తులో శిఖరాగ్రంలో అవకాశం కల్పించాడు. దీనిని బట్టి శివయ్య భక్తులకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాడో అర్థమవుతుంది. ఆలయంలో వెలసిన మూలవిరాట్టుకు హారతి ఇచ్చిన తరువాత అర్చకులు భక్తకన్నప్ప విగ్రహాన్ని చూపుతారు. దీనిని బట్టి కూడా భక్తకన్నప్ప ప్రాధాన్యత అర్దమవుతుంది. అంతేకాక శ్రీకాళహస్తిలో ప్రస్తుతం ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయం పూర్వం భక్తకన్నప్ప ఆలయమని చెబుతారు.



**నేడు ధ్వజారోహణం:**

ఎంతో పురాణ ప్రసిద్ది చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న 'భక్తకన్నప్ప' ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణంతో అంకురార్పణ చుడతారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఇఓ. డి.బాపిరెడ్డి తెలిపారు. శుక్రవారం భక్తకన్నప్ప ధ్వజారోహణం ఏర్పాటు చేశామన్నారు. అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరౌతారనే అంచనాలతో ఏర్పాట్లను చేపట్టారు.

## ఇఓను కలసిన కళ్యాణ ఉభయదారులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఈ నెల 28న జరిగే కళ్యాణ ఉభయదారులు కైకాల సంఘం, సెంగుంధర్ కులవెళ్ళుత్తూరు మరబినర్ సంఘం గ్రామాస్తులు గురువారం ఆలయ ఇఓ టి.బాపిరెడ్డిని కలసి సత్కరించారు. కార్యక్రమాలకు ఇఓను ఆహ్వానించారు.


**CLASSIFIED**

I,**POLLURI CHIRANJEEVI** (old Name) S/o Poluri Narasimhulu, R/at DNo:1-1, Gandlapalli (V), Adavikammapalli (P), Sambepalli (M), Annamayya Dist, A.P. I Have changed my name to **POLURU CHIRANJEEVI** S/o Poluri Narasimhulu. Henceforth I shall be known as **POLURU CHIRANJEEVI** (New Name).

**CLASSIFIED**

I,**KONDETE SUBRAMANYAM** (old Name) S/o Kondeti Venkata Subbaiah, R/at DNo:5-14, Eguvareddipalli, Kammapalli (P), Pullampeta (M), Annamayya Dist. A.P. I have changed my name to **KONDETI SUBRAMANYAM** S/o Kondeti Venkata Subbaiah. Henceforth I shall be known as **KONDETI SUBRAMANYAM** (New Name).

**SRIKALAHASTI MUNICIPALITY**

The Comissioner, Srikalahasti Invites Tender on e-Procurement platform from the "eligible contractors' for the following works

| IFB | Name of the work | No.of works | Estimate amount RS in Lakhs |
|---|---|---|---|
| IFB No: 32&36/2023 -24, 26, 27, 32, 33 to 39/2024-25 Date:20-2-2024 | Pipe Line, Infrastructure Facilities, Retaining Wall, Park, Bore Wells, Greenary. R.O Plant, Manholes, UGD, Drains | 12 works | 126.10 |
| TOTAL | | 12 works | 126.10 |

For particulars please contact Deputy Executive Engineer during office working hours (or) see e-procurement market place : https://tender.apeprocurement.govt.in

Sd/- Commissioner,
Srikalahasti Municipality